నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 ఖమ్మం, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 KHAMMAM

తలకుమించిన భారంతో
విధుల్లోకెళ్తున్న
అంగన్‌వాడీ టీచర్లు
ఎన్నికల విధుల దగ్గర నుంచి
పోక్సో కేసుల విచారణల వరకూ..
జ్వరాల సర్వే దగ్గర నుంచి
గ్రామసభల్లో భాగస్వామ్యం దాకా..
అసలు విధుల కంటే అధిక భారంగా
అదనపు బాధ్యతలు..
626 కేంద్రాల్లో ఆయాల పనులూ
అంగన్‌వాడీ టీచర్లకే..
ఇంటి అద్దెలు, గ్యాస్ బిల్లుల కోసం
ఏళ్లతరబడి ఎదురుచూపులు



సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు(ఫైల్)

# అంగన్‌వాడీలు.. అనేక విధులు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : గ్రామస్థాయి విధుల్లో అందరి నోళ్లలో నానే నౌకరి.. అంగన్‌వాడీ టీచర్. 'వేతనం మూరెడు.. విధులు బారెడు..' అనే దైన్యం వారిది. సొంత శాఖలో అసలు విధుల కంటే ఇతర శాఖల్లోని అదనపు బాధ్యతలే వీరికి అధిక భారాన్ని నెత్తిన పెడుతున్నాయి. వీధిలో ఎవరు కదిలినా మెదిలినా, ఊరి చివరన చీమ చిటుక్కుమన్నా.. 'ప్రభుత్వానికి ప్రాథమిక సమాచారం అందించే బాధ్యత మీకు లేదా?' అంటూ యంత్రాంగం నుంచి చీవాట్లు, చీత్కారాలు. స్త్రీ, శిశు సంక్షేమంలో అత్యంత కీలకమైన విధుల్లో ఉండే అంగన్‌వాడీలు.. వైద్యారోగ్య, పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు శాఖలు సహా ఎన్నికల సంఘం విధుల్లోనూ భాగస్వాములవుతున్నారు. పని భారాలు, పడిగాపులతో సహవాసం చేసే అంగన్‌వాడీలది.. చివరికి సొంత శాఖల్లో ఆయాల విధులనూ చక్కదిద్దాల్సిన దయనీయ స్థితి. క్షేత్రస్థాయిలో ఎంతో క్రియాశీకంగా పనిచేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం పెడుతున్న పని భారాలపై ప్రత్యేక కథనం.

## సొంత శాఖలోనే సవాలక్ష పనులు

సొంత శాఖలోనే సవాలక్ష పనులతో క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నారు అంగన్‌వాడీ టీచర్లు. వివాహితలు గర్భం దాల్చిన దగ్గర నుంచి మొదలుకొని వారి ఆరోగ్య పరిరక్షణ, వారి కడుపులోని బిడ్డ సంపూర్ణ సంరక్షణ వంటివి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉంటారు. గర్భిణి వయసు, ఎత్తు, బరువు నుంచి మొదలుకొని సమస్త సమాచారాన్నీ రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. యాప్‌లలోనూ డేటాను నిక్షిప్తం చేస్తుంటారు. చివరికి రాత్రి వేళల్లోనూ ఇదే విధుల్లో తలమునకలై ఉంటున్నారు. గర్భిణికి ప్రసవ సమయం దగ్గర పడినా, ప్రసవించి పండంటి బిడ్డకు జన్మనిచ్చినా ఆయా వివరాలన్నీ ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. ఇక ఆ బిడ్డ ప్రాథమిక విద్యాభ్యాసానికి వెళ్లేదాకా పర్యవేక్షణ చేస్తుంటారు. ప్రీ ప్రైమరీ బాధ్యతలనూ వీళ్లే చూస్తున్నారు. ఈ మధ్యలో ఆయా శివువుల బరువు, ఎత్తు సహా వారి సమస్త ఆరోగ్య పర్యవేక్షణ, సమాచార నమోదు వంటివన్నీ ఎప్పటికప్పుడు రికార్డు చేస్తారు. ఆ తరువాత ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. ఇవే క్షణం తీరికలేని పనులంటే.. వీటికి ఎన్నో రెట్లు అధికమైన అదనపు బాధ్యతలనూ వీరి నెత్తిన పెడుతోంది ప్రస్తుత ప్రభుత్వం. పట్టణ ప్రాంతాల్లోని అత్యధిక శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. అద్దె భవనాలతోనే వీరు నెట్టుకొస్తున్నారు. అయితే వీటి అద్దెలను ప్రభుత్వం ఎప్పుడు విడుదల చేస్తుందనేది అంతుబట్టని అంశం. ఇక గ్యాస్ బిల్లులదీ అదే కథ. దీంతో వీటిని వీరు సొంతంగా భరిస్తూనే విరామం లేకుండా విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. అధికారుల ఆకస్మిక తనిఖీలు, విధుల్లో నిర్లక్ష్యమంటూ పెట్టే చీవాట్లు అదనం.



ఎన్నికల డ్యూటీలో భాగంగా ఇంటింటి సర్వే చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ (ఫైల్)

## రాత్రి వేళల్లో డేటా ఎంట్రీలు

ఉదయం నుంచి సాయంత్రం వరకూ సొంత శాఖ పనులను, అదనపు శాఖల విధులను చక్కదిద్దుతున్న అంగన్‌వాడీలకు రాత్రి వేళలో విశ్రాంతి దొరికే అవకాశమూ ఉండడం లేదు. శిశువుల జననాల దగ్గర నుంచి మొదలుకొని వారికి ఫీడింగ్ దాకా అన్ని అంశాలనూ మొన్నటి వరకూ 14 రకాల రికార్డుల్లో నమోదు చేసేవారు. ఇప్పుడు సాంకేతికతను ప్రభుత్వం చేతిలో పెట్టడంతో దాని విధుల్లోనూ తలమునకలు కావాల్సిన పరిస్థితి. ఇక రాత్రివేళ ఇంటికి చేరుకున్నాక సమగ్ర సమాచారాన్ని ఆయా యాప్‌లలో నమోదు చేస్తున్నారు. రాత్రి పది దాటినా, పన్నెండైనా ఆయా డేటాను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశాకే నిద్రకు ఉపక్రమించాల్సిన స్థితి.

## అనేక శాఖల్లో అదనపు బాధ్యతలు

మాతృసంస్థ బాధ్యతలేగాక ఇతర అనేక శాఖల్లోనూ ప్రభుత్వం వీరిని భాగస్వామ్యం చేసింది. మిషన్ భగీరథ, ఓటర్ల జాబితా, జ్వరాలు, తల్లీపిల్లల సర్వేలను వీరే ప్రధానంగా నిర్వహిస్తున్నారు. పారిశుధ్య పనులు, అవగాహన కార్యక్రమాలు, గ్రామసభల వంటివి క్రమం తప్పకుండా ఉంటున్నాయి. పోక్సో కేసుల నమోదు వంటి అంశాల్లో ఒక్కోసారి వీరు పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇక బాల్య వివాహాలు జరిగితే మొదటి సమాచారం ఇవ్వాలి.. దాంతోపాటు ఆ సమయంలో పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు, కేసులు వంటివి ఉంటే స్టేషన్లలో రాత్రి వరకూ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఇన్ని అదనపు పనుల భారం ఉండడంతో ఒక్కోసారి సొంత శాఖ విధులకు కూడా సరైన న్యాయం చేయలేకపోతున్నారు. జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో 626 మినీ అంగన్‌వాడీలు ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. కానీ.. ఈ కేంద్రాలకు టీచర్ ఒక్కరే. ఆయాలు లేరు. దీంతో ఈ కేంద్రాల్లో ఆయాల విధులు కూడా అంగన్‌వాడీలే నిర్వహించాల్సిన పరిస్థితి. అయితే తాము అప్‌గ్రేడెడ్ కేంద్రాల్లో పనిచేస్తున్నప్పటికీ గత నెలలో తమకు మినీ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకిచ్చే వేతనాలనే అందించినట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఇన్ని బాధ్యతలతో కేంద్రాలను ఎలా నడిపేది?



అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం అనేక అదనపు బాధ్యతలు అప్పగిస్తోంది. దీంతో వారు అన్ని రకాల పనులను ఎలా నిర్వహించగలరు? మళ్లీ తమ అంగన్‌వాడీ కేంద్రాలను ఎలా నడపగలరు? అలాగే, 65 ఏళ్లకే అంగన్‌వాడీలను స్వచ్ఛందంగా దిగిపోవాలని చెప్పిన ప్రభుత్వం.. ఇచ్చిన మాట ప్రకారం వారికి సరైన బెనిఫిట్స్ ఇవ్వడం లేదు. ఇక బీఎల్‌వోల డ్యూటీలు వేసి నరకం చూపిస్తున్నారు. పక్కనే కాన్వెంట్లకు అనుమతులిచ్చి అక్కడే అంగన్‌వాడీ కేంద్రం నడపమంటే ఎలా కుదురుతుంది?

**–సీతామహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు**

### బీఎల్‌వోల డ్యూటీని ఎవరైనా చేయాల్సిందే..



బీఎల్‌వోల డ్యూటీలను ఎవరైనా చేయాల్సిందే. ఎవరికీ మినహాయింపు ఉండదు. బడ్జెట్ ఆలస్యం అవడం వల్ల అద్దె బిల్లులు, గ్యాస్ బిల్లులు సకాలంలో రావడం లేదు. వాటిని వెంటనే పూర్తి చేసి వారికి చెల్లిస్తాం. కొత్త ఆయా పోస్టులను, ఖాళీ అయిన అంగన్‌వాడీ స్థానాలను భర్తీ చేస్తాం. రిటైర్మెంట్ అయిన టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం పారితోషికం ఇస్తుంది.

**–విజేత, డీడబ్ల్యూవో, భద్రాద్రి జిల్లా**



పోడు భూమిలో అటవీ శాఖ అధికారులు తొలగించిన పత్తి మొక్కలను చూపిస్తూ నిరసన తెలుపుతున్న రైతు భూక్యా మిట్టు, కుటుంబ సభ్యులు

## పోడు భూమిలో పత్తి పంట ధ్వంసం

- ఎకరం మేర మొక్కలను పీకేసిన అటవీ శాఖ అధికారులు
- న్యాయం చేయాలంటూ బాధిత రైతు వేడుకోలు

చండ్రుగొండ, సెప్టెంబర్ 14 : ఎకరం పోడు భూమిలో ఓ గిరిజన రైతు సాగు చేసిన పత్తి పంటను అటవీ శాఖ అధికారులు పీకివేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ మండలం బాలియాతండాలో శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోకలగూడెం పంచాయతీ పరిధిలోని బాలియాతండాకు చెందిన భూక్యా మిట్టు తనకున్న పోడు భూమి(పట్టా కలిగినది) మూడున్నర ఎకరాల్లో పత్తి సాగు చేశాడు. అటువైపు కొన్నాళ్లుగా అటవీ శాఖ అధికారులు రావడంతోపాటు రైతు వేసిన పంటలను పరిశీలించేవారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున అటవీ శాఖ అధికారులు తమ సిబ్బందితో వచ్చి సుమారు ఎకరం భూమిలో పత్తి పంటను పీకివేశారు. ఆ మొక్కలు కూడా దరిదాపుల్లో కనిపించకుండా తమతోపాటే తీసుకెళ్లారు. అయితే రోజువారీగా ఉదయం చేను వద్దకు వెళ్లిన రైతు మిట్టు కుటుంబ సభ్యులు పత్తి మొక్కలు తొలగించిన భూమిని చూసి ఆందోళన చెందారు. పంట భూమిలో మిగిలిన పత్తి మొక్కలను పట్టుకొని నిరసన తెలిపారు. తనకు గత కేసీఆర్ ప్రభుత్వంలోనే పోడు పట్టా వచ్చిందని, ఇప్పుడు అధికారులు మా పంటను ఎందుకు ధ్వంసం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని బాధిత రైతు తెలిపాడు.

**పట్టా తీసుకొస్తే పరిశీలిస్తాం.. :**
**ఎల్లయ్య, ఫారెస్ట్ రేంజర్, చండ్రుగొండ మండలం**

పోడు రైతు తన వద్ద ఉన్న పోడు పట్టాను తీసుకొచ్చి చూపిస్తే పంట ధ్వంసం చేసిన విషయాన్ని పరిశీలిస్తాం. పంట ధ్వంసం విషయం నాకు ఇప్పుడే తెలిసింది. కొత్తగా పోడు నరికితే ఎంతటివారైనా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. అడవుల సంరక్షణ అందరి బాధ్యత.

## నా రాజకీయ గురువు మా నాన్నే..

- మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- 86 మందికి కృత్రిమ కాళ్లు పంపిణీ




కృత్రిమ కాళ్లను పంపిణీ చేస్తున్న మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, సెప్టెంబర్ 14 : సీపీఐ జాతీయ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు పుట్టినరోజు సందర్భంగా శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం లింబ్ సెంటర్‌లో 86 మందికి కృత్రిమ కాళ్లను మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పంపిణీ చేశారు. అనేక కారణాలతో కాళ్లు పోగుట్టుకున్న వారికి పువ్వాడ ఫౌండేషన్ ద్వారా కృత్రిమ కాళ్లు తయారుచేయించి పంపిణీ చేసి వారి ముఖాల్లో నవ్వులు చిందించారు. ఈ సందర్భంగా మాజీమంత్రి అజయ్‌కుమార్ మాట్లాడుతూ నాన్న ప్రతి పుట్టినరోజున ఎన్నో పుట్టినరోజు చేసుకుంటారో అన్ని లింబ్స్(కృత్రిమ కాళ్లు) పువ్వాడ ఫౌండేషన్ తరపున పంపిణీ చేస్తామని అన్నారు. ఖమ్మం రోటరీ క్లబ్ సహకారంతో పువ్వాడ ఫౌండేషన్ ద్వారా నిధులు సమకూర్చి ప్రత్యేకంగా తయారుచేయించి ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ పుట్టినరోజున రూ.3,44,000 లతో 86 మందికి కృత్రిమ కాళ్లు పంపిణీ చేశామని పేర్కొన్నారు. నాన్న ప్రోత్సాహంతో ఎంతో మంది రాజకీయాల్లోకి వచ్చారని, తన రాజకీయ గురువు కూడా నాన్నే అని అన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఖమ్మం మాజీ గవర్నర్ మల్లాది వాసుదేవరావు, డిప్యూటీ గవర్నర్ దొడ్డపనేని సాంబశివరావు, అధ్యక్షుడు నల్లమోతు రవీంద్రనాథ్, సెక్రటరీ హరి శ్రీనివాస్, మేకల భిక్షమయ్య, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, కూరాకుల వలరాజు, నాయకులు వల్లభనేని రామారావు, పౌర సమితి అధ్యక్షుడు పులిపాటి ప్రసాద్, నగర ప్రచార కార్యదర్శి షకీనా, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, యూత్ అధ్యక్షుడు దేవభక్తిని కిషోర్, ఉస్మాన్, గొల్లపుడి హరికృష్ణ, అబ్బాస్, మోరంపుడి సాయి, విజయ్, అజయ్ పాల్గొన్నారు.

## బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా సాగుదాం..

- ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



వద్దిరాజుకు జ్ఞాపికను అందజేస్తున్న సంఘ నాయకులు

ఖమ్మం, సెప్టెంబర్ 14 : రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుదామని మున్నూరుకాపులు, బీసీలకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ట్రస్ట్ ఆఫ్ పటేల్స్(టాప్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో మున్నూరుకాపులు, బీసీలకు స్థానం లభించాలని కోరుకున్నారు. దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన మున్నూరుకాపుల నుంచి నిధులు సేకరించి సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో మున్నూరు కాపు ప్రముఖులు, నాయకులు పాల్గొన్నారు.

## నిమజ్జనం రోజు ట్రాఫిక్ ఆంక్షలు

**నిర్దేశించిన రూట్లలోనే విగ్రహాలను తరలించాలి**
**వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి**
**పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

ఖమ్మం, సెప్టెంబర్ 14 : ఖమ్మం నగరంలో సోమవారం గణేశ్ నిమజ్జనం సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లతోపాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీపీ సునీల్ దత్ తెలిపారు. నిమజ్జనం, శోభాయాత్ర నేపథ్యంలో ఆయా రూట్లలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. ఖమ్మం నగరంలో నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన అనంతరం శనివారం ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనం సందర్భంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, ఆర్ అండ్‌బీ, వైద్య, విద్యుత్ శాఖల సమన్వయంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టామన్నారు. సుమారు 700 విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉన్నందున నిమజ్జన ప్రదేశంలో సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి నిఘా పెడతామన్నారు. నిమజ్జనం వద్ద ఒక్కో వాహనం వెంట ఇద్దరిని మాత్రమే లోనికి అనుమతించాలని ఆదేశించారు. శోభాయాత్రలో సౌండ్ సిస్టమ్, డీజేలు, లేజర్ కిరణాలు వినియోగించడం నిషిద్ధమన్నారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అడిషనల్ డీసీపీలు నరేశ్‌కుమార్, ప్రసాద్‌రావు, విజయబాబులతోపాటు సుమారు 700 మంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏసీపీలు 7, సీఐలు 18, ఎస్‌ఐలు 63, ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుళ్లు 175, కానిస్టేబుళ్లు 405, హోంగార్డులు 159 మంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు.



రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న సీపీ సునీల్ దత్




### శోభాయాత్ర కొనసాగించే మార్గాలు ఇవే..

- మామిళ్లగూడెం ఏరియా గణేశ్ విగ్రహాల ఊరేగింపు మయూరిసెంటర్–కిన్నెర–జడ్పీ సెంటర్–చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు చేరుకోవాలి.
- ఆర్టీఏ కార్యాలయం, బ్యాంక్ కాలనీ ప్రాంతం విగ్రహాల ఊరేగింపు ఎన్టీఆర్ సర్కిల్–ఇల్లెందు క్రాస్ రోడ్–జడ్పీసెంటర్–చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్.
- రోటరీ నగర్, ఇందిరానగర్ ప్రాంతం విగ్రహాల ఊరేగింపు మమత ఎక్స్ రోడ్ వీఆర్‌కే సిల్క్స్–ఇల్లెందు క్రాస్ రోడ్–జడ్పీ సెంటర్–చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్.
- కస్బాబజార్, కమాన్ బజార్ ప్రాంతం విగ్రహాల ఊరేగింపు చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్.
- గొల్లగూడెం శ్రీనగర్ కాలనీ–లకారం ట్యాంక్ బండ్ ప్రాంతం విగ్రహాల ఊరేగింపు ట్యాంక్ బండ్–టాటా మోటార్స్–చెర్వుబజార్–చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్.
- శ్రీరామ్ హిల్స్, ముస్తఫా నగర్ ప్రాంతం విగ్రహాల ఊరేగింపు ముస్తఫా నగర్–చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్.
- ఖమ్మం వైరా రోడ్డు ప్రాంతం విగ్రహాల ఊరేగింపు జడ్పీ సెంటర్–చెర్వుబజార్–చర్చి కాంపౌండ్–ప్రకాశ్ నగర్ మున్నేరు నిమజ్జనం పాయింట్ లేదా బొక్కలగడ్డ మున్నేరు నిమజ్జనం పాయింట్.
- సారథినగర్ గాంధీ చౌక్ ప్రాంతం విగ్రహాల ఊరేగింపు గాంధీ చౌక్–నాయుడు సిల్క్స్–పీఎస్ఆర్ రోడ్–గుంటుమల్లన్న–ట్రంక్ రోడ్– నయాబజార్ మున్నేరు నిమజ్జనం పాయింట్.

### నిమజ్జనం తర్వాత తిరిగొచ్చే వాహనాలు..

**రూట్ నెంబర్ 1 :** మున్నేరు–పంపింగ్ వెల్ రోడ్డు–త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్–హర్కరాబావి సెంటర్–మూడు బొమ్మల సెంటర్–బోస్ బొమ్మ సెంటర్–చర్చి కాంపౌండ్.

**రూట్ నెంబర్ 2 :** మున్నేరు–పంపింగ్ వెల్ రోడ్డు–త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్–హర్కరాబావి సెంటర్–మూడు బొమ్మల సెంటర్–బోస్ బొమ్మ సెంటర్–చర్చి కాంపౌండ్–జడ్పీ–ఇల్లెందు క్రాస్ రోడ్డు–ఎన్టీఆర్ సర్కిల్ లేదా మమత సర్కిల్ మీదుగా వెళ్లాలి.

**రూట్ నెంబర్ 3 :** ప్రకాశ్ నగర్ మున్నేరు–సెయింట్ జోసెఫ్ సెంటర్–చర్చి కాంపౌండ్.

1. ప్రకాశనగర్ బ్రిడ్జి, కాల్వొడ్డు బ్రిడ్జిల ద్వారా ఇరువైపులా అన్ని రకాల వాహనాల రాకపోకలు గణేశ్ నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు నిషేధం.
2. రాపర్తి నగర్–కరుణగిరి బ్రిడ్జి ద్వారా సాధారణ వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది.
3. మయూరి బ్రిడ్జిపై నుంచి నిమజ్జన సమయంలో వాహనాల రాకపోకలు నిషేధం. గణేశ్ విగ్రహం ఊరేగింపు మయూరి బ్రిడ్జి మీదుగా అనుమతించబడదు.
4. నిమజ్జనం తర్వాత రాపర్తి నగర్, న్యూ బస్టాండ్, ఎన్టీఆర్, మమత వైపు వెళ్లే వాహనాలకు నెహ్రూ సర్కిల్ నుంచి ఎఫ్‌సీఐ గౌదాం మీదుగా అనుమతి లేదు. ఆ వాహనాలు కాల్వొడ్డు–త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్–మిర్చి మార్కెట్–చర్చి కాంపౌండ్–చెరువు బజార్–జడ్పీ –ఇల్లెందు క్రాస్ రోడ్డు మీదుగా వెళ్లాలి.

### రూరల్ మండలం నుంచి గణేశ్ విగ్రహాల నిమజ్జనం పాయింట్, వచ్చే మార్గాలు ఇలా..

1. నాయుడుపేట–జలగంనగర్–పెద్ద తండా–సాయి ప్రభాత్ నగర్–సాయి గణేశ్ నగర్–సూర్య నగర్–కరుణగిరి–రాజీవ్ గృహకల్ప–ఏదులాపురం–ముత్తగూడెం–రెడ్డిపల్లి ప్రాంతంలోని గణనాథుల నిమజ్జనం నాయుడుపేట వైపు ఏర్పాటు చేసిన మున్నేరు నది ర్యాంప్ ద్వారా చేయాలి.
2. రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తీర్థాల–మంగళగూడెం–మద్దివారిగూడెం–పొలిశెట్టిగూడెం–గూడూరుపాడు–తనగంపాడు–కస్నాతండా, కాచిరాజుగూడెం–ఎంవీపాలెం–ఆరెకోడు–ఆరెకోడు తండా–వాల్యాతండా–పిట్టలవారిగూడెం–పోలేపల్లి–గోళ్లపాడు–పల్లెగూడెం గ్రామాల గణనాథులు తీర్థాల వద్ద మున్నేరులో నిమజ్జనం చేయాలి.

## రేపటి గిరిజన దర్బార్ రద్దు



ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 14 : మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించే గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు ఐటీడీఏ పీవో రాహుల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సందర్భంగా ఐటీడీఏ యూనిట్ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండని కారణంగా గిరిజన దర్బార్ రద్దు చేశామని పేర్కొన్నారు. గిరిజనులు ఈ విషయాన్ని గమనించి అర్జీలు సమర్పించడానికి ఐటీడీఏ కార్యాలయానికి రావొద్దని ఆయన సూచించారు.

